WWW.EPAPER.MAHAADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
02-09-2025 | మంగళవారం



## పంచమ రాత్రి ఉత్సవాలకు ఘన ముగింపు...

### గణనాధులకు ఘనంగా వీడ్కోలు

మణుగూరు, సెప్టెంబర్ 1 మహా : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో పంచమ రాత్రి వినాయక ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన గణనాధులను ఊరేగించి భక్తిశ్రద్ధలతో ఘనంగా వీడ్కోలు పలికారు గణనాథుడి ఊరేగింపు సందర్భంగా డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్స్ నడుమ చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా ఉత్సాహభరితంగా నృత్యాలు చేస్తూ గణపతికి వీడ్కోలు పలికారు.

వివరాలు 3లో





## గృహప్రవేశ మహోత్సవానికి బెండలపాడు రెడీ...!

4లో

### రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక ఖరారు

మంత్రి పొంగులేటి సూచనల మేరకు సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తుంబూరు దయాకర్ రెడ్డి

*అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలంలోని బెండలపాడు గ్రామంలో ఈ నెల 3వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు సభాస్థలిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇండ్లను పరిశీలించిన అనంతరం సభకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యంగా వర్షం పడిన సందర్భంలో ప్రజలు, విచ్చేసే అతిథులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.* - మహా, చంద్రుగొండ



## ఖమ్మం పల్లెలో సోలార్ విప్లవం

- ఎనిమిది గ్రామాల 'మోడల్ సోలార్' పోటీ
- అక్టోబర్ 3న విజేత గ్రామం ప్రకటన

04



## వరదల నష్టంపై ముఖ్యమంత్రి సమీక్ష

- పునరుద్ధరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి
- రోడ్లు, చెరువులు, విద్యుత్ నష్టం వివరాలు తెలపండి
- కేంద్ర సహాయం కోసం తక్షణ నివేదిక ఇవ్వండి
- డిజాస్టర్ ఫండ్ వినియోగం సమర్పణ కీలకం
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్

ఖమ్మం, మహా: ఆగస్టు చివరి వారం తెలంగాణలో కురిసిన భారీ వర్షాలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో విపత్తు సృష్టించాయి. రోడ్లు, చెరువులు, కాల్వలు, విద్యుత్ పరికరాలు, పంచాయతీరాజ్ సదుపాయాలు దెబ్బతినడంతో, జిల్లా కలెక్టర్లు మరియు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.

08

# మా సమస్యలు పట్టించుకోండి సార్

## అండర్ రైల్వే బిడ్జీతో అవస్థలు : గిరిజన సంఘం

**కారేపల్లి, మహా :** ఏజన్సీలో ప్రజల సమస్యలు ప్రభుత్వాలకు పట్టటం లేదని, లింక్ రహదారులు, రైల్వే అండర్‌బ్రిడ్జీలు గిరిజనులను అవస్థల పాలు చేస్తున్నాయని తెలంగాణ గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజ్మీర శోభన్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో జైత్రాంతండా సమీపంలో దక్షిణ మధ్య రైల్వే నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జీ వర్షంతో నీటి నిండి రాకపోకలు నిలిచిపోయాయి. ఆ బ్రిడ్జీని గిరిజన సంఘం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా అజ్మీర శోభన్ నాయక్ మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది వేతన ఖర్చు తగ్గించుకునే పేరుతో రైల్వే గేట్లను తొలగించి జైత్రాంతండా, మొట్లగూడెం, గాదెపాడు వద్ద అండర్ రైల్వే బ్రిడ్జీలను నిర్మించిందన్నారు. ఆ అండర్ బ్రిడ్జీ లు వర్షాకాలంలో చెరువులను తలపిస్తూ బ్రిడ్జీల గుండా రాక పోకలు నిలిచి పోతున్నాయన్నారు. పంట చేలకు అరకలు వేళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలకు, వైద్యం కోసం వాహనాల ద్వారా అండర్ బ్రిడ్జీల నుండి వెళ్ళాల్సి రావటంతో ఆ బ్రిడ్జీలు నీళ్లతో నిండి చేలకు వెళ్ళలేకపోతున్నారని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే, అండర్ బ్రిడ్జీల నుండి నీటిని తొలగించాల్సి ఉండగా ఆ పనులు చేయక పోవటంతో ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పాలవుతున్నారన్నారు. గిరిజన ప్రాంతాలలో రహదారులు గుంతలమయంగా మారి వాహనాలు తిరగ లేని పరిస్థితి ఉంది. చీమలపాడు ` టేకులపల్లి రహదారి గుండా నిత్యం ఈ ప్రాంత ప్రజలు ప్రయణిస్తుంటారని ఆ రహదారి గుంతలు పడటంతో



వాహనాలు వాటిలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజన్సీలో నెల కొన్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరగక ముందే అండర్ బ్రిడ్జీలలో ఎప్పటికప్పుడు నీటిని తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ధరావత్ వినోద్‌కుమార్, కోరం అప్పారావు, బానోత్ వెంకటేష్, భూక్య దళ్‌సింగ్, రమేష్, హిరాలాల్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు బ్యాగులు, మైక్ వితరణ




**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం గాదెపాడు ప్రాథమికొన్నత పాఠశాల లో టీఎస్‌యూటీఫ్ నాయకులు బానోత్ మంగీలాల్ చోరవతో అతని మిత్రులు విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాంగులు, పాఠశాలకు మైక్ సెట్‌ను వితరణ చేశారు. మను, తృప్తేష్ షా, రామన్, శీరీష, సంజయ్ పంచాల్ ఆర్ధిక సాయంతో తీసుకవచ్చి బ్యాగులు, మైక్ సెట్లను కాంప్లెక్స్ హెచ్‌ఎం తేజావత్ శారధ చేతుల మీదిగా విద్యార్థులకు అందజేశారు. ఈసందర్బంగా గాదెపాడు పాఠశల హెచ్‌ఎం రసకట్ల మల్లేశ్వరరావు దాతలను అభినందించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు కేవీ కృష్ణారావు, ఉపాధ్యాయులు బిక్కు, కిషన్, మురళి, కృష్ణవేణి, పరమేష్ ,అంగన్వాడీ టీచర్ రాణెమ్మ, గ్రామపెద్దలు వేముల రామూర్తి, కేలోత్ సూర్యకుమార్, గడిపర్తి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

- 15 మందికి గాయాలు
- రెండు కిలోమీటరు టాఫిక్ జామ్







**ఖమ్మం, మహా :** వైరా మండలం స్టేజి పినపాక బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 మంది ఆర్టీసీ బస్సు ప్రయాణికులు గాయపడ్డారు. మణుగూరు నుండి ఖమ్మం వెళ్ళిపోతున్న ఆర్టీసీ బస్సు, వైరా నుండి తల్లాడ వైపు వస్తున్న లారిని ఎదురుగా వచ్చి అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు, అయితే తృటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన ప్రయాణికులను అంబులెన్స్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అస్పత్రిలో చికిత్స పొందిన వారిలో కొందరి పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. ప్రమాదం కారణంగా వైరా-తల్లాడ రహదారిపై వాహనాలు నిలిచిపోయి, రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సంఘటన స్థలాన్ని వైరా ఏసిపి రహమాన్, సిఐ సాగర్, ఎస్‌ఐ పి. రామారావు పరిశీలించి, కేసు నమోదు చేశారు. వాహనాల వేగ నియంత్రణ, రోడ్డు భద్రతా చర్యలు, లారీ పార్కింగ్ నియమాలు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పారిశుధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలి




**నేలకొండపల్లి, మహా :** గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బోదులబండ గ్రామంలో గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాలలో కురుస్తున్న వర్షాలతో పారిశుధ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్ల వెంట నీళ్లు నిలిచిపోయి, సైడ్ డ్రైన్లలో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయన్నారు. తద్వారా ప్రజలు వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడి అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్ల వెంట శానిటేషన్ పనులు చేపట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, వర్షపు నీరు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. గత అనేక నెలలుగా ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను చెల్లించాలని, యుద్ధ ప్రాతిపదికన సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కట్టెకోల వెంకటేశ్వర్లు, శాఖ కార్యదర్శి కొరదల సీతారాములు, అనంతు ఎల్లయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గణనాథులకు ఘనంగా వీడ్కోలు



**మణుగూరు, సెప్టెంబర్ 1 మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో పంచమ రాత్రి వినాయక ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన గణనాథులను ఊరేగించి భక్తిశ్రద్ధలతో ఘనంగా వీడ్కోలు పలికారు గణనాథుడి ఊరేగింపు సందర్భంగా డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్స్ నడుమ చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా ఉత్సాహ భరితంగా నృత్యాలు చేస్తూ గణపతికి వీడ్కోలు పలికారు. భక్తుల హర్షోత్సాహాలతో వీధులు సందడిగా మారాయి. ఈ సందర్భంగా మేదర్ బస్తి వినాయక మండపం వద్ద నిర్వహించిన లడ్డు వేలంపాటలో ఓ భక్తురాలు 6,500 రూపాయలకు లడ్డు, మరో భక్తుడు 4,000 రూపాయలకు కలశం సొంతం చేసుకున్నారు. ఉత్సాహం, భక్తి, ఐక్యత ఉట్టిపడిన ఈ వేడుకలు వీధుల్లో, రహదారులపై ఆధ్యాత్మిక శోభ చోటు చేసుకోగా గణనాథుడికి ఘన వీడ్కోలుగా నిలిచాయి.

# "ఆఫీస్ అంతా ఖాళీ కుర్చీలకే అంకితమా…?"



**బోనకల్ మహా :** బోనకల్ మండల పరిధిలోని గోవిందాపురం లక్ష్మీపురం గ్రామ రైతులు పంట నష్టం వాటిల్లిందని ఫిర్యాదు చేసేందుకు గ్రామ రైతు వేదిక వద్దకు రైతులు వెళ్లగా అగ్రికల్చర్ ఏవో అనూష లేకపోవడం గమననార్హం. వారం రోజులుగా ఆఫీస్ తెరిచి ఉంటుంది కానీ విధుల్లోకి అగ్రికల్చర్ ఏవో అనూష రావడంలేదని గ్రామస్తులు తెలిపారు.భారీ వర్షాల కారణంగా రైతుల పంట నష్టం జరిగి కన్నీరు మయంలో ఉంటే రైతుల పంట సాగుకు సక్రమంగా ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్న కూడా అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఎటువంటి స్పందన లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతులకు అండగా ఉండాల్సిన అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అధికారులే రైతులకు సహకరించకుండా ఉండడం చాలా బాధాకరమని అన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ అనుదీప్ శెట్టి దృష్టికి తీసుకువెళ్లి మండల అగ్రికల్చర్ అధికారుల ఆఫీసుల పై తనిఖీలు జరిపి మండల అధికారులు సక్రమంగా విధులకు వచ్చి రైతుల పంటల సమస్యలకు న్యాయం జరిగేలా, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందేలా,ఎరువులు అందేలా చూడాలని గ్రామ రైతులు ఆశిస్తున్నామన్నారు.

# ప్రజల ఆరోగ్యం పై ప్రభుత్వ బాధ్యతారాహిత్యం

- పల్లె ప్రజల ఆరోగ్యం పై ప్రభుత్వ నిర్లక్ష్యం దారుణం
- మాజీ ఎమ్మెల్యే డా.బానోత్ చంద్రావతి తీవ్ర ఆవేదన

**ఖమ్మం, మహా :** తుపానుల తర్వాత పల్లె ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు మరింత ప్రబలగా ఉండటంతో, డెంగ్యూ, మలేరియా, పాముకాటు వంటి ప్రమాదకర వ్యాధులు ప్రజలను బెదిరిస్తున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు అని వైరా మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి తీవ్రంగా మండిపడ్డారు. కొణిజర్ల మండలం పెద్దగోపతి, కొణిజర్ల ఆరోగ్య కేంద్రాలను తనదైన శ్రద్ధతో పరిశీలించిన ఆమె, ప్రభుత్వ వైద్యం అందక ఎందరో పేదలు అనారోగ్యంతో మృతి చెందుతున్నారు అని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుత ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల వైద్య సేవలు, తగినంత మంది డాక్టర్లు, సిబ్బంది, అవసరమైన మందులు, మెరుగైన ఆసుపత్రి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికీ స్పందించి, పల్లె ప్రజల ప్రాణాలను కాపాడాలి అని డా. బానోత్ చంద్రావతి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ కిలారి మాధవరావు, ఖాదర్ బాబు బానోతు వెంకన్న, భూక్య వీరన్న రాజకుమార్, బూర ప్రసాదరావు, నాగేశ్వరరావు, బూర సుధాకర్ బండారు బ్రహ్మం, బెల్లం కొండ కృష్ణ, దొడ్డ సురేష్, ఉసికల చిరంజీవి, నాగయ్య, వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, పుల్లయ్య, భూషయ్య గురవయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వానికి రుణపడి ఉంటాము బీసీ సంఘం నాయకులు




**కారేపల్లి, మహా:** కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామని బీసీ సంఘం నాయకులు అన్నారు. సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో గల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి సింగరేణి మండల బీసీ నాయకులు పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నటు వంటి బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను గత ఏ ప్రభుత్వం చేపట్టలేదు. తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసిన ఘనత రేవంత్ రెడ్డి దే అని ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం మాట నిలబెట్టుకున్న ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే అని కొనిఆడారు. గత పాలకులు బీసీల ఓట్ల తో గెలిచిన ఏ నాయకుడు బీసీల గురించి పట్టించుకోలేదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సమాజంలో మంచి గుర్తింపు తెచ్చినందుకు రాష్ట్రంలో ఉన్న బీసీలందరూ రుణపడి ఉంటారని వారు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలందరూ ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని వారు కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా బీసీ గణన చేయలేదు, తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ధైర్యంగా ఒక్క అడుగు ముందుకేసి బిసి కులగనన చేశారని, కేంద్రంలోఅధికారంలో గల బిజెపి పార్టీ కులగననకు ఎన్ని అడ్డంకులు ఏర్పరిచిన వారి అడ్డంకులను సేదించి రాష్ట్రంలో కులఘనన నిర్వహించి 42% బీసీలకు కేటాయించడం మనందరికీ ఆనందదాయకమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, పెద్ద బోయిన ఉమాశంకర్, అడ్డగోడ ఐలయ్య, పోలగాని శ్రీనివాస్, ముత్యాల సురేష్, గమిడి నరసింహారావు, అడప పుల్లారావు, కడారి ఉపేందర్, అనీఫ్,ఎండి యాకుబ్ పాషా, ఎస్ కే పాష, పిట్టల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం గుంటు మల్లేశ్వరి స్వామి దేవాలయంలో అన్నదానం

**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలోనే ప్రసిద్ది కల్గిన స్వయంభు శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయం భక్తులు సోమవారం అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. వాసవి వారోత్సవాలు సందర్భంగా వాసవి క్లబ్ ఖమ్మం అధ్యక్షులు పసుమర్తి రామ్మోహన్ రావు, గాంధీచౌక్ క్లబ్ అధ్యక్షురాలు ధనారపు వాసవి ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం ఉమ్మడి జిల్లా వాసవి క్లబ్స్ గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు, క్లబ్ క్యాబినెట్ కోశాధికారి శ్రీ గుంటుపల్లి దివాక గుప్తా, ఖమ్మం వాసవి క్లబ్ సెక్రటరీ పెచ్చా కృష్ణమోహన్, కోశాధికారి పసుమర్తి శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు చిన్ని లక్ష్మి భవాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఖమ్మం పల్లెలో సోలార్ విప్లవం

- **ఎనిమిది గ్రామాల 'మోడల్ సోలార్' పోటీ**
- **అక్టోబర్ 3న విజేత గ్రామం ప్రకటన**



**ఖమ్మం, మహా :** ఖమ్మం జిల్లా పల్లెలో మోడల్ సోలార్ విలేజ్ ప్రాజెక్ట్ ప్రజల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కేంద్రం సూచించిన మార్గదర్శకాల ప్రకారం, ఎక్కువగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే గ్రామమే మోడల్ సోలార్ విలేజ్ అవుతుంది. కేంద్రం సూచించిన మార్గదర్శకాల ప్రకారం ప్రారంభమైన మోడల్ సోలార్ విలేజ్ ప్రాజెక్ట్, ఇప్పటివరకు ఎనిమిది గ్రామాలను కవర చేసింది. ఇప్పుడు ఎవరి గ్రామం ఎక్కువగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తుందో **'సోలార్ విలేజ్' బిరుదు దక్కించుకుంటుంది.**

ఈ పోటీలో అన్నారుగూడెం, తల్లాడ, తనికెళ్ళ, కొనిజర్ల, నెలకొండపల్లి, ముడిగొండ, వల్లభి, కందుకూరు గ్రామాలు ఉన్నాయి. ప్రత్యేకంగా జనాభా 5000 పైగా ఉన్న గ్రామాల్లో ఎక్కువ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా ప్రకటిస్తారు. ప్రజలు ఇప్పటివరకు విద్యుత్ కోసం ప్రభుత్వం మీదే ఆధారపడేవారు. ఇప్పుడు సూర్యశక్తిని వినియోగించి, విద్యుత్ పొదుపు చేయడం, అవసరమైతే అదనపు విద్యుత్ ప్రభుత్వానికి అమ్మే అవకాశాలు ఉన్నాయంటే, గ్రామాలు ఉత్సాహంతో ముందుకు వస్తున్నాయి. సెప్టెంబర్ 2 నుంచి 6 వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. టీజీ ఎన్పీడీసీఎల్, టి జి రెడ్కో అధికారులు ప్రత్యక్షంగా హాజరై ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తారు. ప్రత్యేకంగా సెప్టెంబర్ 2న అన్నారుగూడెం గ్రామంలో ఉదయం 9 గంటలకు, తల్లాడ గ్రామంలో సాయంత్రం 4 గంటలకు మొదటి కార్యక్రమాలు ఉంటాయి. విజేతగా నిలిచిన గ్రామం అక్టోబర్ 3న ఖమ్మం జిల్లా మోడల్ సోలార్ విలేజ్‌గా ప్రకటించబడుతుంది. ఇప్పటికే గ్రామాల మధ్య సన్నాహక పోటీ మొదలైందని, ప్రజల్లో "మా గ్రామమే సోలార్ విలేజ్ కావాలి" అనే ఉత్సాహం గట్టిగానే ఉన్నట్లు సమాచారం. ఖమ్మం జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే, తెలంగాణలో సోలార్ విద్యుత్ విప్లవానికి మార్గం సిద్ధమవుతుంది. ప్రజలు ప్రతి ఇంటి పైకప్పు చిన్న విద్యుత్ కేంద్రంగా మారాలన్న ఆశతో ప్రేరణ పొందుతున్నారు.

# సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముట్టడి




**సత్తుపల్లి, సెప్టెంబర్ 1: మహా.** నిరుపయోగంగా ఉన్న కాకర్లపల్లి గ్రామ సమీపంలోగల ఎన్టీఆర్ కాలువను మట్టితో పూడ్చి ఆ స్థలాన్ని ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇవ్వాలని సిపిఎం గ్రామశాఖ వేపులపాటి కుమారస్వామి అధ్యక్షతన సత్తుపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.దీనిలో భాగంగా కాకర్లపల్లి గ్రామ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ కు అందజేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కాకర్లపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేసిన సందర్భంలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు.సుమారు 125 మందికి ఇళ్ల స్థలాలు లేక ఒకే ఇంటిలో రెండు,మూడు కుటుంబాలు నివాసం ఉంటూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు.కాకర్లపల్లి గ్రామంలో సెంటు భూమి కొనుక్కో లేని పేద ప్రజలు ఉన్నారని,ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు స్పందించి కొన్ని ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఎన్టీఆర్ పాత కాలువని సింగరేణి మట్టితో పూడ్చి అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు,ఆసరా పెన్షన్లు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ పార్టీల జోక్యం అరికట్టాలన్నారు.స్థానిక సమస్యలు,ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి,పార్టీ సీనియర్ నాయకులు బాల బుచ్చయ్య, కాకర్లపల్లి పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బండి వేలాద్రి, మండల కమిటీ సభ్యులు అయినంపూడి సనంధరావు, హసావత్ కృష్ణ, కావూరి వెంకటేశ్వరరావు, బెజవాడ లక్ష్మీనారాయణ, ఆంగోతి చిట్టెమ్మ, రమాదేవి, తిరుపతి అజయ్,వేంపాటి కృష్ణయ్య, పరిమి సీతామహాలక్ష్మి ,కోవాకుల పరమేష్,రాజేశ్వరి,ఫరీదా, గాలిబీ తదితరులు పాల్గొన్నారు.

# కళ్లకు గంతలేసి పియానో మాయాజాలం

- **దేశభక్తి గీతాలతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్**
- **ఖమ్మం విద్యార్థి ఇషాన్ ప్రతిభకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు**



**ఖమ్మం, మహా :** ప్రతిభకు అడ్డులు లేవని మరోసారి నిరూపించాడు ఖమ్మం జిల్లాకు చెందిన బాల ప్రతిభావంతుడు బచ్చుపల్లి ఇషాన్. కళ్లకు గంతలు కట్టుకొని వరుసగా 16 దేశభక్తి గీతాలను పియానోపై వినిపించి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సువర్ణాక్షరాలతో తన పేరు లిఖించుకున్నాడు. చిన్న వయస్సులోనే సాధనతో, క్రమశిక్షణతో రికార్డులను అధిరోహించిన ఈ విజయంతో ఇషాన్ కేవలం తన పాఠశాలకు మాత్రమే కాకుండా మొత్తం ఖమ్మం జిల్లాకే గర్వకారణంగా నిలిచాడు* ఖమ్మం జిల్లా నారాయణ విద్యాసంస్థ విద్యార్థి బచ్చుపల్లి ఇషాన్ తన అసాధారణ ప్రతిభతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. కళ్లకు గంతలేసి వరుసగా 16దేశభక్తి గీతాలను పియానోపై వాయించడం ద్వారా ఈ అరుదైన రికార్డు సాధించాడు. ఈ ఘనతకు గుర్తింపుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఇషాన్‌కు *"సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్"*ను అందజేశారు. ఇషాన్ విజయంపై ఆయన తల్లిదండ్రులు నవీన్ కుమార్, పవని అపారమైన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, తమ కుమారుడి కృషి ఫలితమే ఈ విజయం అన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నుండి లభించిన మార్గదర్శకత కూడా ఎంతో తోడ్పడిందని వివరించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థలో ఘనంగా అభినందన సభ జరిగింది. ఏజీఎం ఎస్. రాంకీ మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలు, సంగీతం, సాంస్కృతిక రంగాలలో కూడా విద్యార్థులు రాణించేందుకు తాము ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ అమలోద్భవి మాట్లాడుతూ, "విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా బహుముఖ ప్రజ్ఞతో ముందుకు సాగాలన్నది మా లక్ష్యం" అని వివరించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి కుమార్, ప్రవీణ్ కుమార్, మాధవరావు, నాగేశ్వరరావు, చందు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా ప్రతిభను దేశవ్యాప్తంగా చాటిన ఇషాన్ విజయానికి హర్షం వ్యక్తమవుతోంది.

# గృహప్రవేశ మహోత్సవానికి బెండలపాడు రెడీ...!

- **ఈనెల 3న సీఎం రేవంత్ రెడ్డి రాక ఖరారు**
- **మంత్రి పొంగులేటి సూచనల మేరకు సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయాణ, తుంబూరు దయాకర్ రెడ్డి**





**చంద్రుగొండ , మహా :** అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలంలోని బెండలపాడు గ్రామంలో ఈ నెల 3వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు సభాస్థలిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇండ్లను పరిశీలించిన అనంతరం సభకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యంగా వర్షం పడిన సందర్భంలో ప్రజలు, విచ్చేసే అతిథులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.

ANN తెలుగు
మహా పత్రిక
Follow: @ANNTELUGU
02-09-2025 | మంగళవారం
WWW.EPAPER.MAHAADAILY.COM
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం


# వసతి గృహాల పట్ల ప్రభుత్వం కు చిత్తశుద్ధి లేదు



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 1 మహా :** ప్రభుత్వ వసతి గృహాల పట్ల పాలకులకు చిత్త శుద్ధి లేదని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సొడెపొంగు ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. వసతి గృహాల ఆవరణం అంతా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. విద్యార్థులు ఎదుర్కంటున్న సమస్యల పై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... సంక్షేమ వసతి గృహాలలో సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. విద్యార్థుల కు కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. మోనూ ఖచ్చితంగా పాటిం చాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఇంట్లో ఉండే భావన కలిగించేలా సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేని పక్షంలో క్షేత్ర స్థాయిలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ముక్తవరపు కిషోర్, పట్టణ అధ్యక్షుడు పగిడికత్తుల శ్రీకాంత్, వినయ్, విజయ్, సాయి, దీపక్, వేణు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతులు ఆగ్రహం

- రైతులు క్యూ లలో నిరీక్షణ.. యూరియా లేక ఆవేదన
- కొమరారంలో రాస్తారోకో
- భారీగా నిలిచిపోయిన వాహనాలు
- పోలీసులతో వాగ్వాదం.. చర్చల తర్వాత ఆందోళన విరమణ




**ఇల్లందు, మహా :** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఇల్లందు మండలం కొమరారం యూరియా విక్రయ కేంద్రం వద్ద సోమవారం రైతుల ఆగ్రహం ఉధృతమైంది. గత రెండు రోజులుగా యూరియా కోసం పడిగా పులు కాస్తున్న రైతులకు సరఫరా జర గకపోవడంతో వారు రాస్తారోకో-ధర్నా చేపట్టారు. దీంతో ఇల్లందు-గుండాల ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**"రైతు ఏడ్చినా రాజ్యం కదలడం లేదు"**

ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ మధు హాజర్రై మాట్లాడుతూ – "మూడు నెలలుగా యూరియా కోసం రైతులు ఆందోళనలు చేస్తున్నా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మొక్కజొన్న పంటకు సరైన సమయంలో ఎరువులు అందక రైతులు పంటల్ని దున్నివేస్తున్నారు. రైతు ఏడ్చినా రాజ్యం, ఎద్దు ఏడ్చినా రాజ్యం బాగుపడదనే స్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సరైన చర్యలు తీసుకోవడం లేదు. రైతులు అర్ధరాత్రివరకు కుటుంబాలతో ఆకలితో క్యూల్లో నిలబడుతున్నారు. వెంటనే యూరియా కొరతను నివారిం చాలి" అని తీవ్రంగా హెచ్చరించారు.

**పోలీసులు, రైతుల మధ్య ఘర్షణ వాతావరణం** ఆందోళనను విరమిం పజేయడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసులు ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగారు. వాహనాలు కదలకపోవడంతో ఇల్లందు-గుండాల రహదారి మొత్తం స్థంభించింది.

**చర్చల తర్వాత హామీ – ఆందోళన విరమణ**

రైతుల డిమాండ్లను అనుసరించి వ్య వసాయ అధికారి యస్వంత్ అక్కడికి చేరుకుని చర్చలు జరిపారు. గుండాల, ఇల్లందు మండలాలకు అధిక లారీ లోడ్లలో యూరియా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన ను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యాదలపల్లి సత్యం, మోకాళ్ల కృష్ణ, నరసింహారావు, మండల నాయకుడు మాలు జోగా కృష్ణ, పోచారం మాజీ సర్పంచ్ శ్రీను, బోయి తండా సర్పంచ్ సంతు, పోలారం సర్పంచ్ సొరట్, మాణిక్యారం మాజీ సర్పంచ్ కోటక్కా, హార్జ్య, సీతారాములు, మంగ్య, కోటన్న, తుడుం శ్రీను, రాజాలు, అల్ ఇండియా ట్రైబల్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ సువర్ణపాక నాగేశ్వరరావు, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోతిలాల్, బావుసింగ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉరుములు మెరుపులతో భయంకర భారీ వర్షం



**జూలూరుపాడు, సెప్టెంబర్ 01, (మహా):** ఆకాశం అంతా నిర్మలంగా ఉండి ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భయంకరమైన భారీ వర్షం ఆదివారం రాత్రి జూలూరుపాడు మండల వ్యాప్తంగా కురిసింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు గా కుండ పోత వాన తెల్లారే వరకు కురవడంతో మండలంలోని చెరువులు మత్తడి దూకాయి. వాగులు వంకలు పొంగి ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వినోబానగర్ గ్రామంలో ఇండ్లలోకి నీళ్లు చేరి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అప్రమత్తమైన అధికారులు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా 69.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వాతావరణ హెచ్చరిక, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలంతా ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.



# గొర్రెల కు వచ్చే జబ్బులకు నివారణ చర్యలు చేపట్టాలి



**ఖమ్మం, మహా :** గొర్రెలకు సీజనల్ గా వచ్చే జబ్బుల పై నివారణ చర్యలు చేపట్టాలని, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్. పురందర్ ను అఖిల భారత యాదవ మహాసభ నాయకులు గొర్రెల సమస్యలపై,మరియు జబ్బుల నివారణ చర్యలు చేపట్టాలని వినతిప త్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవాలకు సీజనల్ గా ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే నీలి నాలుక, గొంతువాపు వ్యాధి, చిటుకు వ్యాధి, ఊపిరితిత్తుల నిమ్ము లాంటి అంటు వ్యాధులు ఎక్కువగా వచ్చి గొర్రెలు మరణించే పరిస్థితి ఉందని. దీనివలన గొర్రెల పెంపకం దారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపో యే అవకాశం ఉందని వీటిపై తక్ష ణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని, పెంపకం దారులు అమా యకత్వంతో తెలిసి తెలియక మందుల షాపులు వాళ్లు అధిక ధరలకు ఇచ్చిన మందుల్ని కొనుక్కొని తీవ్రంగా నష్ట పోతున్నారని అదేవిధంగా గొర్రెల పెంపకం దారులకు జబ్బులపై అవగా హన సదస్సులు ఏర్పాటు చేయాలని, నట్టల నివారణ మందులు వెంటనే పోయాలని, తదితర సమస్యలపై వినతి పత్రం సమర్పించడం జరిగిందని నాయకులు తెలిపారు. జెడి పురంధర్ ఈ సమస్యలపై స్పందించి వారం రోజులలో డి వార్మింగ్ చేస్తామని, అదేవిధంగా ప్రస్తుతం వ్యాధి నిరోధక వ్యాక్సిన్సు కార్యక్రమం నడుస్తుందని, అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపినట్లుగా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, మొరి మేకల కోటయ్య తోడేటి లింగరాజు వాకధాని కోటేశ్వరరావు, వాకధాని వలరాజు బండారు ప్రభాకర్, కన్నెబోయిన రవి పల్లెబోయిన కోటేశ్వరరావు మరియు తదితరులు పాల్గొన్నారు

# అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, మహా :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్ లో పోలీస్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసుకున్న అన్నదాన కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. ముందుగా పోలీస్ కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న గణేష్ మండపంలోని స్వామి వారని దర్శించిన పోలీస్ అధికారులు పూజలు నిర్వహించారు. అనంతరం ఎర్పాటు చేసిన అన్నదాన కా ర్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ పోలీసు సిబ్బందికి, పోలీస్ కుటుంబాలకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో అడిషనల్ ఏ ఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, టౌన్ ఏసీపీ రమణమూర్తి, రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఎస్బి ఏసీపీ మహేష్, ఏ ఆర్ ఏసిపీ సుశీల్ సింగ్, సిఐ లు రాజిరెడ్డి, కరుణాకర్, రామకృష్ణ,ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.

# ఉప్పొంగిన వాగులు నిలిచిన రవాణా వ్యవస్థ

## ముంపు ప్రాంతాల్లో పోలీసులు రక్షణ చర్యలు

**ఖమ్మం, మహా :** ఖమ్మం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి రహదారులపైకి ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో రవాణా నిలిచిపోగా, ముంపు గ్రామాల్లో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా పోలీసులు, రెవిన్యూ అధికారులు తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపట్టారు. కామేపల్లి మండలంలోని పొన్నెకల్ వద్ద బుగ్గవాగు వంతెనపై రెండు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో పొన్నెకల్-కొత్తలింగాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తూ కామేపల్లి ఎస్సై పర్యవేక్షణలో పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు. అదే సమయంలో, ఖమ్మం నగరంలో మున్నేరు వాగు ఉధృతంగా పొంగి పొర్లుతోంది. కాల్వవొడ్డ వద్ద ఎవరూ చేరకుండా, స్థానికులను అప్రమత్తం చేసేందుకు కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు. త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారు. దంసాలాపురం-బోనకల్ రహదారిపై కూడా వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అర్బన్ ఇన్స్పెక్టర్ బానుప్రకాష్ అక్కడ తాత్కాలికంగా బారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనదారులను మరల్చుతున్నారు. కారేపల్లి మండలం పేరుపల్లి-మాదారం రహదారిపై బుగ్గవాగు ప్రవహిస్తూ, పేరుపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీనితో ఎస్సై గోపి, రెవిన్యూ అధికారుల సమన్వయంతో ముంపు బాధితులను ట్రాక్టర్లలో పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో పోలీసు-రెవిన్యూ సంయుక్త చర్యలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతోంది. వరద నీరు తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.





# అన్నదానం.. మహా ప్రసాదం...



**అశ్వాపురం, మహా :** మొండికుంట గ్రామంలోని రామాలయం సెంటర్ లోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ మేరకు ఇక్కడి కమ్యూనిటీ వారు మాట్లాడుతూ..అన్నదానం మహా ప్రసాదం అని అన్నారు.అన్నిదానాల కన్న అన్నదానం గొప్పదన్నారు.. ఈ కార్యక్రమనికి భక్తులు భారీగా తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. ఉచిత అల్పాహార మీల్స్ ఆన్ వీల్స్



**అశ్వాపురం. మహా :** లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ ఆధ్వర్యంలో సోమవారం అశ్వాపురం ప్రభుత్వ వైద్యశాల వద్ద పిడిజిసిహెచ్ శివప్రసాద్, లయన్ లీడర్ ఎడవెల్లి కృష్ణ, జెడ్సి కురిచేటి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఉచిత అల్పాహార మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు*. హెల్త్ సెంటర్లో సుమారు 100 మంది రోగులు బంధువులకు బ్రెడ్స్, అరటి పండ్లు అల్పాహారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ ప్రెసిడెంట్ సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరోజు ఉదయం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మరియు గ్రామాలలో వివిధ ప్రదేశాలలో ఉచిత అల్పాహారం పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామాలలో ఎవరైనా ఇంట్లో శుభకార్యం, పుట్టినరోజు, పెళ్లిరోజు జ్ఞాపకార్థ, వంటి కార్యక్రమాలను పురస్కరించుకొని మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమానికి సహాయం చేయవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మీరహుస్సేన్, మణుగూరు విజన్ ప్రెసిడెంట్ బి సురేష్, అశ్వాపురం కొత్త క్లబ్ ప్రెసిడెంట్ సింగం శ్రీధర్, అశ్వాపురం మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లలో పంటలు : రైతుల కళ్ళల్లో నీరు




**ఖమ్మం, మహా :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుండి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్ని ఇన్ని కావని , రైతుల కళ్ళల్లో కన్నీరు తప్ప మిగిలిందేమీ లేదని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు , వరదల వల్ల , కొణిజర్ల మండలంలోని తనికెళ్ళ గ్రామం లోని పంట పొలాల్లో దిగి నీట మునిగిన వరి పంటను, దెబ్బతిన్న ప్రత్తి ,పెసర పంటలను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి రైతులు అనేక కడగండ్లకు గురవుతు , సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు . జూన్ నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా కొంచెం ముందు వెనుకగా రైతులు పత్తి పెసర పంటలు వేయగా తీవ్రమైన ఎండల వల్ల పంటలు దెబ్బతిన్నాయన్నారు. మిగిలిన పంటలైన కాపాడుకుందాం అనుకున్న సందర్భంలో భారీ వర్షాలు ,వరదల వల్ల పంటలు నాశనం అయ్యాయని , ఈ పరిస్థితుల్లోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముందు చూపు లేకపోవడం వల్ల యూరియా కొరత తలెత్తిందని విమర్శించారు. ఈ విధంగా అన్ని విధాలుగా రైతు నష్టపోయాడని కోలుకోలేని పరిస్థితులు తలెత్తాయని వాపోయారు. పంటల భీమా పథకం రైతుల్ని ఆదుకోలేని విధంగా పలులోసుగులు ఉన్నాయని విమర్శించారు. రైతును యూనిట్ గా తీసుకొని పంట నష్టానికి బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు . భారీ వర్షాలకు వరదలకు దెబ్బతిన్న రోడ్లను కూడా వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. నీట మునిగిన పంటలను పరిశీలించడానికి వచ్చిన బృందంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు , జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండ పాటి రమేశ్,సింగు నరసింహారావు, తాటి వెంకటేశ్వర్లు, మిడి కంటి వెంకటిరెడ్డి , సిపిఐ కొణిజర్ల మండల పార్టీ కార్యదర్శి గడల భాస్కర్ రావు ,సహాయ కార్యదర్శి మణిగ కోటేశ్వరరావు , గ్రామ శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు , బానోత్ రామయ్య పెదమల్ల రత్తమయ్య పొట్లపల్లి నరసింహారావు , నరేష్ సీతారాములు , లాకావత్ రాములు , కమటాల భిక్షం , సంగెపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీ

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 1 మహా:** నేలకొండపల్లి మండల కేంద్రంలోని రైతులందరికీ ఎల్లుండి నుంచి సొసైటీ కేంద్రాల్లో యూరియా పంపిణీ బుధవారం నుండి పిఏసిఎస్ ముఠాపురం,రాజేశ్వరపురం,ముజ్జుగూడెం, నాచేపల్లి,నేలకొండపల్లి చెన్నారం,రామచంద్రాపురం,అప్పల నరసింహపురం,చెరువు మాదారం,మంగాపురం తండా,పైనంపల్లి,బోదుల బండ,మండ్రాజుపల్లి మరియు కొత్తగా ఏర్పాటు చేసిన సొసైటీ సబ్ సెంటర్ల నుండి యూరియా పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది.రైతులు యూరియా కోసం వచ్చేటప్పుడు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ మరియు ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలి భూమి ఉన్న రైతు వచ్చినట్లయితే ఈపాస్ మిషన్లో వేలిముద్ర ద్వారా యూరియా ఇవ్వబడుతుంది ఒకవేళ అట్టి రైతు రాలేని పక్షంలో కుటుంబ సభ్యులను పంపిస్తే వారి మొబైల్ కి వచ్చే ఓటీపీని వెంటనే చెప్పే విధంగా చూసుకోవాలి లేదా వారి మొబైల్ నైనా ఇచ్చి పంపించాలి. రైతులు కచ్చితంగా గుర్తించవలసిన విషయం ఏమిటంటే క్రింద సూచించిన విధంగా ఆయా గ్రామాల రైతులు కచ్చితంగా సూచించబడిన సెంటర్ వద్ద మాత్రమే యూరియాను తీసుకోవాలి వేరే సెంటర్ కి వెళ్తే యూరియా ఇవ్వబడదు.

# వినాయక చవితి వేడుకలు వీక్షించేందుకు వెళ్లగా ఇంట్లో చోరీ

**అశ్వాపురం : మహా :** వినాయక చవితి సందర్భంగా మండపం వద్ద చేపడుతున్న కార్యక్రమాలకు వీక్షించేందుకు వెళ్లిన చిన్న తండా కు చెందిన ఓ మహిళ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని చిన్న తండాకు చెందిన తేజావత్ విజయ అనే మహిళ ఆదివారం సాయంత్రం సమీపంలో నిర్వహిస్తున్న వినాయకుని ఉత్సవ కార్యక్రమాలను చూసేందుకు వెళ్లింది. అదే సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేనిది గమనించి గడ్డ పలుకుతో కలుపుకున్న తాళాలను పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అలాగే బీరువా తాళాలను చాకచక్కగా పగలగొట్టి రూ. 20 వేల నగదు తో పాటు 11 గ్రాముల బంగారం అపహరించుకు వెళ్ళినట్లు తెలిపింది.



# మధిరలో డ్రైనేజీ పనుల నిర్లక్ష్యం



**మధిర రూరల్, మహా :** మధిర పట్టణంలో ఎన్జీవోస్ కాలనీ, మొదటి బజారులో డ్రైనేజీ పనుల పేరుతో త్రవ్వకాలు చేసి వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మధ్యలో త్రవ్విన గుంతలు, విచ్చలవిడిగా పేరుకున్న మట్టి, వర్షాల వల్ల నిలిచిపోయిన మురుగు నీరు... ఇవన్నీ కలసి ప్రజలకు ఊహించని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. తాత్కాలికంగా పూసిన గుంతలు వర్షాల కారణంగా మళ్లీ బురదగా మారి వాహనదారులకు, పాదచారులకు ప్రాణహానికరంగా మారాయి. రోజూ ఈ దారిలో వెళ్తున్న పలువురు రోడ్డు మీద జారిపడి గాయాలపాలవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఈ దారిలో ప్రయాణించడం మరింత కష్టమైంది. మురికి నీరు నిలిచిపోవడంతో పందుల బెడద పెరిగింది. దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉంది. శానిటేషన్ లోపంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. స్థానికులు ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఎటువంటి చర్యలు లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "పట్టణ ప్రజల సమస్యలపై అధికారులు నిద్రలేచి చర్యలు తీసుకోవాలి. వెంటనే ఈ రహదారిని బాగు చేసి డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి" అని మొదటి బజారు వాసులు కోరుతున్నారు. ప్రజల నిత్యజీవితాన్ని దెబ్బతీస్తున్న ఈ నిర్లక్ష్యంపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ఖమ్మం,మహా:** ప్రజావాణిదరఖాస్తులనుసత్వరమేపరిష్కరించాలనిఅదనపు కలెక్టర్లుడాక్టర్‌పి.శ్రీజ,పి.శ్రీనివాసరెడ్డిలుజిల్లాఅధికారులనుఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారుఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తు లను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన పి. కావ్య తనకు కల్లూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో 7వ తరగతి సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్.సి.ఓ. కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామ పంచాయతీ, లింగం బంజర గ్రామస్థులు గ్రామంలో గతం నుంచి ఉన్న రోడ్డును ట్రాక్టర్ ద్వారా దున్ని చెడగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, రోడ్డును తిరిగి ప్రజా ప్రయోజనార్థం నిర్మించి అప్పగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం పార్శీబంధంకు చెందిన షేక్ ఆసియా తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామానికి చెందిన జి. సత్యనారాయణ పుట్టకోట చెరువు 50 ఎకరాల పాటు ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటూ చెరువు సుందరీకరణ, ఆధునీకరణ పనులు చేపట్టాలని దరఖాస్తు చేయగా కలెక్టరేట్ ఈ విభాగం సూపరింటెండెంట్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసపూరిత హామీలు బహిర్గతం

- రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఏకం కావాలి
- మున్నూరుకాపుల సంఘటిత శక్తిని చాటాలి
- వాషింగ్టన్ వేదికపై వద్దిరాజు రవిచంద్ర పిలుపు






**ఖమ్మం, మహా. :** వాషింగ్టన్ డీసీలో ఘనంగా జరిగిన గ్లోబల్ మున్నూరుకాపు మహాసభలో తెలంగాణ బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఉత్సాహభరితంగా ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామంటూ ప్రజలను మభ్యపెట్టి ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా మోసం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్నూరుకాపుల ఆవేదనను అంతర్జాతీయ వేదికపై బహిర్గతం చేస్తూ, "రాజ్యాధికారమే మన లక్ష్యం - బీసీలు ఏకతతో ముందడుగు వేయాలి" అంటూ ఉత్తేజకర పిలుపునిచ్చారు* అమెరికాలోని వాషింగ్టన్ డీసీ, లీస్‌బర్గ్ ప్రాంతంలో గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ రవిచంద్ర (వద్దిరాజు) సభికుల హృదయాలను తాకే విధంగా ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ హామీలను మోసపూరితంగా వాడుకొని ఓట్లు దండుకున్నదని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా బీసీ రిజర్వేషన్లు అమలు సాధ్యం కాదని బహిరంగంగా ఎద్దేవా చేశారు. మున్నూరుకాపుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను వివరిస్తూ, "మనం రైతు బిడ్డలం, అన్నదాతలం, పదిమందికి అన్నం పెట్టే వారం. కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరుకాపుల జనాభాను తగ్గించి చూపడం, మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించడం తీవ్ర నిర్లక్ష్యం" అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన మున్నూరుకాపు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను వెంటనే మంత్రివర్గంలో చేర్చాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు స్వగ్రామాల అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. "పవన్ కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. ఓటములపై నిరాశ చెందకుండా పోరాడి 2024లో విజయాన్ని సాధించిన జనసేనలా మనమూ సంఘటితంగా ముందుకు సాగాలి" అని ఎంపీ రవిచంద్ర అన్నారు. తన వ్యక్తిగత జీవిత ప్రయాణాన్ని స్ఫూర్తిదాయకంగా వివరిస్తూ, "30 ఏళ్ల క్రితం గాయత్రి గ్రానైట్స్ స్థాపించి 2,000 మందికి ఉపాధి కల్పించాను. ఢిల్లీలోని జాతీయ పోలీస్ మెమోరియల్, కర్తవ్యపథ్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి బ్లాక్ గ్రానైట్ సమకూర్చాను" అని గుర్తుచేశారు. మహాసభలో పలు రాష్ట్రాల నుంచి, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తదితర దేశాల నుంచి వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రను ఘనంగా సన్మానించగా, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన యువతిని ప్రత్యేకంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ వంటకాల విందుతో సభ మరింత వైభవంగా జరిగింది. ఈ మహాసభను విజయవంతం చేసిన నిర్వాహకులను అభినందిస్తూ, "మున్నూరుకాపులతో పాటు అన్ని బీసీలను సంఘటితం చేసి, కలిసికట్టుగా రాజ్యాధికార సాధన వైపు నడవాలి. ఇతరులను కించపరచకుండా కలుపుకుంటూ మన శక్తిని చూపించాలి" అని రవిచంద్ర పిలుపునిచ్చారు.

# నిర్విరామ ప్రభుత్వ సేవల అనంతరం ఘన వీడ్కోలు





**ఖమ్మం,మహా :** నిర్విరామ ప్రజలకు ప్రభుత్వ పరంగా సేవలు అందించిన ఉద్యోగులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆగస్టు నెలలో పదవి విరమణ పొందిన 10 మంది ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్య నారాయణ, ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన ముదిగొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్, శాంతి నగర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ చాంద్ పాషా, హార్టికల్చర్ శాఖకు చెందిన ఆఫీస్ సబార్డినేట్ వెంకటేశ్వరరావు, గిరిజన శాఖకు చెందిన హెడ్మాస్టర్ కొర్ర శివ, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి, లంక సాగర్ పి.హెచ్.సి. సి.హెచ్.ఓ. పూలమ్మ, వైరా పి.హెచ్.సి. ఎంపిహెచ్ఎస్ పి. రాజ్యలక్ష్మి, కూసుమంచి తహసిల్దార్ కార్యాలయ సబార్డినేట్ నరసింహాం, ట్రెజరీ విభాగం నేలకొండపల్లి ఎస్టిఓ అబ్దుల్ హఫీజ్ లు పదవీ విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డి.ఎస్.సి.డి.ఓ, జిల్లా అధికారులు చాలా చురుగ్గా పని చేశారని, జిల్లా పాలన సాఫీగా కొనసాగడంలో ఉత్సాహంగా, కీలకంగా పని చేశారని అదనపు కలెక్టర్ కొనియాడారు. పదవి విరమణ తర్వాత కూడా అంతే ఉత్సాహంగా ప్రభుత్వ విద్యా సంస్థలను పరిశీలించి మెరుగ్గా సేవలు అందించేందుకు సలహాలు, సూచనలు అందించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యా శాఖ ప్రిన్సిపాల్ శ్రీనివాస అనేక మంది విద్యార్థులను జీవితంలో తీర్చిదిద్దారని అన్నారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు ఇంగ్లీష్ టీచర్ చాలా ప్రభావం చూపించిందని అన్నారు. రాబోయే యువతకు విలువలు ఉండాలంటే ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ చాలా కీలకమని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు పదవి విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి సభ విజయవంతం చేయాలి - ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, సెప్టెంబర్ 1 మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి మహాసభను విజయవంతం చేయాలని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ పేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలోని చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో సెప్టెంబర్ 3న నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం కావడానికి పినపాక నియోజకవర్గంలోని కాంగ్రెస్ కుటుంబ సభ్యులందరూ, మండల టౌన్ ప్రెసిడెంట్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా కలసి రావాలని కోరారు. సభను జయప్రదం చేసి కాంగ్రెస్ శక్తిని చాటాలని కోరారు.

## మణుగూరు ఏరియాలో షాకింగ్ ఘటన

- కార్మికుడిని కాటు వేసిన పాము
- కార్మిక కాలనీ కుటుంబాల్లో ఆందోళన



**మణుగూరు, సెప్టెంబర్ 1 మహా :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఇటీవలే సింగరేణి సి టైప్ కాలనీలో పట్టుబడిన పాము ఘటన మరువకముందే... మళ్లీ పాముకాటు కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. మన ఊరు ఏరియా ఓసి2 గని డంపర్ షెడ్ లో జనరల్ మజ్దూర్ గా పనిచేస్తున్న కమటం వెంకటేశ్వర్లు సోమవారం మొదటి షిఫ్ట్‌లో పనిచేస్తుండగా అకస్మాత్తుగా పాముకాటుకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన ఏరియా ఎస్ ఓ టు జిఎం శ్రీనివాసచారి బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌కి తరలించేలా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా, పామును పట్టుకోవడానికి ఇంజినీర్ వెంకటేశ్వర్లు ఇచ్చిన కాల్‌కు స్పందించిన స్నేక్ మహమ్మద్ ముజాఫర్ అక్కడికి చేరుకొని పామును పట్టుకున్నాడు. అది ఇండియన్ వోల్ఫ్ స్నేక్ అనే విషరహిత జాతి అని నిర్ధారించాడు. ఆసుపత్రిలో వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి ముజాఫర్ కు ధైర్యం చెప్పగా, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ముజాఫర్ వద్దకు వెళ్లి ధైర్యం చెప్పారు.

**కార్మికుల్లో ఆందోళన..**

కార్మిక కాలనీలో, పని ప్రదేశాల వద్ద వరుసగా పాములు కనిపించడం కార్మికుల్లో తీవ్ర ఆందోళన రేపుతోంది. కార్మికుల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఓసి టు పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి విపరీతంగా పెరగడంతో పాటు చెత్త కూడా వేరుకపోయిందని ఈ సందర్భంగా కార్మిక నేతలు వాపోతున్నారు. వెంటనే పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తాచెదారాన్ని తొలగించాలని సింగరేణి యాజమాన్యాన్ని వారు కోరుతున్నారు.

# కాళేశ్వరం పై రాజకీయ కుట్ర

- ప్రజా వ్యతిరేక విధానాలకు రెండు రోజుల నిరసనలకు బిఆర్ఎస్ పిలుపు
- సీఎం రేవంత్ పై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



**మణుగూరు, సెప్టెంబర్ 1 మహా :** తెలంగాణ రాష్ట్రంలో కోట్ల ఎకరాలకు నీరందించే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఘోష్ కమిషన్ వేసి ప్రజలను మోసం చేస్తోందని, దీని వెనుక మాజీ సీఎం కేసీఆర్‌పై ఆ పార్టీ రాజకీయ కుట్ర దాగి ఉందని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. కాంగ్రెస్ చర్యలను వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సోమవారం మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిడిపి సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం అసెంబ్లీలో కాళేశ్వరంపై జరిగిన చర్చల నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ ఆయన మండిపడ్డారు. గతంలో పలు ప్రాజెక్టులలో జరిగిన అంశాలపై ఎలాంటి కమిషన్ వేయలేదని ప్రశ్నించారు. కానీ తెలంగాణ ప్రజల ప్రాణధార అయిన కాళేశ్వరంపై కమిషన్ వేయడం అన్యాయమని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. కార్యక్రమంలో కుర్రీ నాగేశ్వరరావు, ముద్దంగుల కృష్ణ, కుంటా లక్ష్మణ్, యాదగిరి గౌడ్, సురేష్ లతోపాటు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరదల నష్టం పై ముఖ్యమంత్రి సమీక్ష




**ఖమ్మం, మహా :** ఆగస్టు చివరి వారం తెలంగాణలో కురిసిన భారీ వర్షాలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో విపత్తు సృష్టించాయి. రోడ్లు, చెరువులు, కాల్వలు, విద్యుత్ పరికరాలు, పంచాయతీరాజ్ సదుపాయాలు దెబ్బతినడంతో, జిల్లా కలెక్టర్లు మరియు సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిజాస్టర్ ఫండ్ వినియోగ వివరాలు, పునరుద్ధరణ యాక్షన్ ప్లాన్, మరియు కేంద్ర సహాయం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది* ఆగస్టు 26 నుండి 28 తేదీలలో తెలంగాణలో కురిసిన భారీ వర్షాలు, కొన్ని జిల్లాల్లో వరదలకు దారితీస్తూ రాష్ట్రానికి విపత్తు ముప్పు కలిగించాయి. ఈ నేపథ్యంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దనసరి అనసూయ (సీతక్క), కోమటి రెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకట స్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు తదితరులతో కలిసి, హైదరాబాద్ నుంచి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విపత్తు నిర్వహణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, కుంటల వివరాలు తక్షణమే సేకరించాలి. వీటి పునరుద్ధరణ, మరమ్మత్తు కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. గత వరదల సమయంలో వినియోగించిన డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులను పూర్తి స్థాయిలో సమర్పించి, కేంద్రం నుంచి సహాయం రావడానికి చర్యలు తీసుకోవాలి. చెరువుల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించడం కూడా అత్యవసరం," అని తెలిపారు. ఆగస్టు వర్షాల కారణంగా రాష్ట్రంలో 720 కోట్లు విలువల 1009 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్లు, 11 కోట్లు విలువల జాతీయ రహదారులు, 374 కోట్లు విలువల పంచాయతీ రాజ్ రోడ్లు, 32.73 కోట్లు విలువల విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావు వివరించారు, "ప్రధానంగా మెదక్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసి, ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలో 4124 కోట్ల రూపాయల వరకు నష్టం సంభవించిందని. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, అధికారులు ప్రతి విభాగానికి సంబంధించి డిజాస్టర్ ఫండ్ వినియోగ వివరాలు సమర్పించి, పునరుద్ధరణ కోసం తక్షణమే చర్యలు చేపట్టాల్సిన బాధ్యతను గుర్తించారు. ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టరేట్ నుండి సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్‌లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. అలాగే డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, ఎస్ఈ ఇరిగేషన్ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, సిపిఓ శ్రీనివాస్, ఎన్డీఆర్ఎఫ్, విద్యుత్ శాఖ, పంచాయతీ రాజ్, పోలీసులు తదితర అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్ : కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 1 (మహా) :** ఈ నెల 3 న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు వారు ట్రాఫిక్ నియంత్రణ చర్యలను చేపట్టడం జరుగుతుందని కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ సోమవారం ప్రకటనను విడుదల చేశారు. విఎం బంజర నుండి చంద్రుగొండ మీదుగా కొత్తగూడెం వైపు వచ్చే వాహనాలు కల్లూరు,తల్లాడ, ఏన్కూరు మరియు జూలూరుపాడు మీదుగా కొత్తగూడెం చేరుకోవాలి. అదే విధంగా కొత్తగూడెం నుండి విఎం బంజర వైపు ప్రయాణించే వాహనదారులు జూలూరుపాడు, ఏన్కూరు,తల్లాడ మరియు కల్లూరు మీదుగా విఎం బంజర వైపు ప్రయాణించాలని కోరారు. ఈ ట్రాఫిక్ డైవర్షన్ 3 వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు.



ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వాహనదారుల ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు తలెత్తకుండా, ట్రాఫిక్లో చిక్కుకోకుండా పోలీసు వారు చేపట్టే ట్రాఫిక్ డైవర్షన్ ను గమనించి ప్రజలు సహకరించాలని డిఎస్పీ రెహమాన్ ఈ సందర్భంగా కోరారు.